

సీసీ రోడ్డు పగులగొట్టారు

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో సిమెంటు రోడ్డును అక్రమంగా పగులగొట్టారని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. - 8లో..



ఇరిగేషన్‌లో అవినీతి ప్రవాహం

మార్కాపురంలో ఇరిగేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35 /26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.







ఒంగోలులోని హెడ్‌పోస్టాఫీస్‌లో ఖాతాలు తెరిచేందుకు బారుతీరిన మహిళలు

అమ్మకు కష్టాలు..

ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం అమలు చేస్తామనా హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారం లోకి వచ్చాక నాలుక మడతెట్టేశారు. తొలి ఏడాది ఎగనామం పెట్టిన ప్రభుత్వం తాజాగా పలు నిబంధనలతో తల్లికి వందనం నిధులు విడుదలజేసింది. అయితే ఇందులో నిబంధనలు చాలా మంది విద్యార్థుల తల్లులను కష్టాలపాలు చేసింది. ఈకేవైసీ కోసం కొంత మంది.. మరి కొంత మంది పోస్టల్ కార్యాలయాల్లో ఖాతాలు తెరిచేందుకు గంటల తరబడి క్యూల్లో నిల్చొని అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈకేవైసీ కానీ, ఇతర దరఖాస్తులకు ఇంటి వద్దకే వలంటీరు అన్నీ వచ్చి చేసి వెళ్లే వాడు. సోమవారం ఒంగోలు ప్రధాన పోస్టల్ కార్యాలయం దగ్గర క్యూల్లో నిల్చున్న జనం వైఎస్సార్ సీపీ పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. - సాక్షి, ఒంగోలు

న్యూస్‌రీల్

తల్లికి వందనంపై వచ్చే అర్జీలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: తల్లికి వందనం పథకం కింద వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం మండల స్థాయి అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో ఆర్థిక ప్రయోజనం దక్కలేదంటూ వచ్చే అర్జీలను తల్లికి వందనం పథకం కింద లబ్ధిదారుల వివరాలను, అనర్హుల వివరాలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ తమకు ప్రయోజనం కలగలేదని, అర్జీలు వస్తే వాటిని తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 10 లక్షల మంది ప్రజలతో యోగాసనాలు వేయించేలా ఇస్తున్న శిక్షణలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అందరూ పాల్గొనేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు..
తల్లిడిల్లి

- తల్లికి వందనం జాబితాల్లో పేర్ల గల్లంతుతో ఆందోళన
- పారిశుద్ధ్య కార్మిక పిల్లలకు నిబంధనల నడలింపు అంటూ ప్రకటన
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కార్మికులు
- జిల్లాలో సుమారు 1619 కుటుంబాల్లో 3500 మంది పేర్లు మాయం
- కాంట్రాక్ట్ ఉద్యోగులు మరో 500 కుటుంబాల్లో 1200 మందికి దూరం
- మా పిల్లలకు చదువులు వద్దా అంటూ ఆగ్రహం
- కార్మిక సంఘాల ఆందోళన
- మార్కాపురంలో ఏఐటీయూసీ ధర్నా
- ఒంగోలులో సీఐటీయూ వినతి పత్రం అందజేత

తల్లి వందనం కష్టాలు పారిశుద్ధ్య కార్మికులనూ వెంటాడుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా అమ్మఒడి ద్వారా ఆర్థిక సాయాన్ని అందుకున్న కుటుంబాలు నేడు ఆందోళన చెందుతున్నాయి. తల్లికి వందనం పథక నిబంధనలు వీరికి వర్తించవంటూ ప్రకటించినప్పటికీ జాబితాలో పేర్లు లేవు.. అధికారులను అడిగితే చూద్దాం అంటూ దాటవేస్తున్నారు. సోమవారం మార్కాపురం, ఒంగోలు కార్పొరేషన్‌ల్లో పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలంటూ వినతి పత్రాలు సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు సుమారు 3,500 మంది, కాంట్రాక్ట్ ఉద్యోగుల పిల్లలు మరో 1200 మంది ఆందోళన చెందుతున్నారు.

• • •

కనిగిరిరూరల్: ''మేము అధికారంలోకి వస్తే చదువుకునే పిల్లలందరికీ నీకు రూ.15 వేలు..నీకు రూ.15 వేలు..నీకు రూ.15 వేలు'' అంటూ కూటమి నాయకులు చంద్రబాబు, లోకేష్ దగ్గర నుంచి అందరూ ప్రచారం చేశారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాక ఏడాది పాటు ఆ ఊసే ఎత్తలేదు. అన్ని వర్గాల నుంచి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో అనేక మంది పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల వాసులకు నెలవారీ కుటుంబ ఆదాయం రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించితే పథకం వర్తించదనే నిబంధన పెట్టారు. ఈమేరకు తల్లికి వందనం అర్హుల జాబితా ప్రకటించారు. అయితే పారిశుద్ధ్య కార్మికులకు వర్తించవని ప్రభుత్వం పేర్కొంది. అయితే సచివాలయాల్లో ప్రదర్శించిన జాబితాల్లో వీరి పిల్లల పేర్లు కనుమరుగయ్యాయి. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదేమిటని సంబంధిత అధికారులను అడిగితే ఇంకా టైం ఉంది కదా చూద్దాంలే అంటూ మాట దాటవేస్తున్నారని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో కార్మిక లోకం..

జిల్లాలోని ఒంగోలు, కనిగిరి, చీమకుర్తి, గిద్దలూరు, మార్కాపురం, దర్శి, పొదిలి నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో సుమారు 1,619 మంది పారిశుధ్య నాన్ పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లు ఉన్నారు. సరాసరి ప్రతి కుటుంబంలో సుమారు ఇద్దరు పిల్లలు విద్యను అభ్యసిస్తున్నట్లు అంచనా. దాదాపు 3,500 మందికి పైగా కార్మికుల పిల్లలు తల్లికి వందనం దక్కని పరిస్థితి. వీరు కాకుండా కాంట్రాక్ట్ బేసిక్‌లో 104, 108 వాహనాల్లో, ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారు సుమారు 500 మంది వరకు ఉన్నారు. వారి పిల్లలు సుమారు 1,000 మంది ఉండవచ్చని అంచనా..

అసలే పెరిగిన ధరలతో అల్లాడుతుంటే..

కూటమి ప్రభుత్వంలో నిత్యవసర ధరలు అమాంతంగా పెరిగాయి. కుటుంబ పోషణ కష్టంగా మారి అల్లాడుతున్న తరుణంలో ప్రభుత్వం సరికొత్త నిబంధనలతో తల్లికి వందనానికి దూరం చేయడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ, నగర పంచాయతీ, కార్పొరేషన్లలో రూ.15 వేల నుంచి రూ.21 వేల జీతంతో అనేక మంది పారిశుధ్య కార్మికులు, నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికులు చాలీచాలని జీతాలతో జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పడంతో నమ్మి అనేక మంది ఓట్లు వేశారు. తీరా నిబంధనల పేరుతో తమ నోట్లో మట్టి కొట్టడం ఏంటని కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తల్లికి వందనాన్ని అమలు చేయాలి..



మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తల్లికి వందనం పథకం వర్తింపచేయాలంటూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తల్లికి వందనం పథకం అమలుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ కార్యదర్శి, సీపీఐ కార్యదర్శి నాసరయ్య తదితరులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ అమ్మఒడి పథకం అమలు చేశారని, కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వర్కర్లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయ లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనరుకు వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు.

చాలీచాలని జీతాలతో అవస్థలు..




ఒంగోలు టౌన్: మున్సిపాలిటీ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు అతితక్కువ వేతనాలు చెల్లిస్తుండడంతో చాలీచాలని జీతాలతో జీవితాలు గడుపుతున్నారని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కార్మికులను ఆప్కాస్ లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్‌లైన్లో పేర్కొనడం ఆశ్చర్యం కలిగిస్తోందని చెప్పారు. ఈ సాకుతో పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందన ఎగనామం పెట్టారన్నారు. దీంతో పాటు పెన్షన్, ఇతర సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ కార్యాలయంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ వైష్ణవికి సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ వినతి పత్రం అందజేశారు.

జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల వివరాలు		
కార్పొరేషన్/ మున్సిపాలిటీ	పారిశుద్ధ్య కార్మికులు	నాన్ పీహెచ్ కార్మికులు
ఒంగోలు	81	200
చీమకుర్తి	92	28
గిద్దలూరు	62	32
మార్కాపురం	189	72
కనిగిరి	89	35
దర్శి	54	13
పొదిలి	73	13

పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు విద్య అవసరం లేదా?

పారిశుద్ధ్య కార్మికులు, పీహెచ్ వర్కర్లకు తల్లికి వందనం పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. అసలే నిత్యవసర ధరలు పెరిగి జీవనం గడవటం కష్టంగా మారినా.. చాలీచాలని జీతాలతో అల్లాడుతున్న పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు తల్లికి వందనం లేకుండా చేస్తే ఎలా? ప్రస్తుతం వారికిచ్చే రూ.15 వేల జీతాలతో కుటుంబ పోషణ గడవటమే కష్టం. నిబంధనల్లో మాత్రం సడలింపు అన్నారు. అయితే లబ్ధిదారుల జాబితాలో వీరి పేర్లు లేవు. వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.



– సయ్యద్ యాసీన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

రైతుల కోసం కేసులకైనా వెనుకాడం

- పొదిలి ర్యాలీలో అనుమతులు లేకుండానే టీడీపీ నిరసనల పేరుతో రాళ్లదాడి
- రాళ్లదాడి చేసిన వారిని వదిలేసి బాధితుల మీదనే అక్రమ కేసులు
- అణిచేసేకొద్దీ మరింత ఉత్సాహంగా పనిచేస్తాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- జిల్లా జైలులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ



జిల్లా జైలు వద్ద బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మేరుగు, అన్నా, చుండూరి, కరణం, బత్తుల, బన్ని తదితరులు

ఒంగోలు టౌన్: గిట్టుబాటు ధరలు రాక ఇబ్బంది పడుతున్న రైతుల కోసమే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనను భగ్నం చేయడానికే టీడీపీ కుట్రపూరితంగా రాళ్లదాడి చేసిందని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు. రైతుల కోసం ఎన్ని కేసులు పెట్టినా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. అక్రమ కేసులతో అణచివేయాలని చూస్తే భయపడేది లేదని, మరింత క్రియాశీలకంగా పనిచేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులో అరెస్టయి జిల్లా జైలులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పార్టీ నాయకులు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, ఒంగోలు, చీరాల నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లు చుండూరి రవిబాబు, కరణం వెంకటేష్, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్నలతో కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పొదిలి పర్యటనలో జగన్‌తో తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చారని తెలిపారు. పోలీసుల అనుమతి తీసుకున్న తరువాతనే పోరుబాట ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీలో టీడీపీ వర్గీయులు నిరసనలకు దిగారని, ర్యాలీని భగ్నం చేయాలన్న కుట్రతోనే రాళ్లదాడికి దిగారని తెలిపారు. ర్యాలీని భగ్నం చేయడానికి ప్రయత్నించిన వారిపై కేసులు పెట్టకుండా ర్యాలీకి వచ్చిన రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టడం అక్రమమని తీవ్రంగా ఖండించారు. సుమారు 3 కేసులు నమోదు చేసి 30 మందికి పైగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. మేము రాళ్లదాడి చేయలేదని, టీడీపీ వారే చేశారని ఎస్పీకి వివరించినట్లు తెలిపారు. రాళ్లదాడి చేసిన టీడీపీ కార్యకర్తల మీద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా విచారణ చేయాలని ఎస్పీని కోరినట్లు చెప్పారు.

జగన్ పొదిలి పర్యటనతోనే కేంద్రంలో చలనం

పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారికి మద్దతు తెలిపేందుకే జగన్ పొదిలి పర్యటనకు వచ్చారని బూచేపల్లి చెప్పారు. దీని వల్లనే కేంద్ర మంత్రి హడావుడిగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారన్నారు. పొగాకు కొనుగోళ్ల కోసం కేంద్రం నుంచి రూ.150 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం ఆలస్యమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ పోరాటం చేయకపోతే, జగన్ పొదిలి పర్యటకు రాకపోతే కేంద్ర మంత్రి ఏపీకి వచ్చేవారా అని ప్రశ్నించారు. రైతుల సమస్యలు, ప్రధానంగా పొగాకు రైతుల బాధలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి పోయేవి కాదని అన్నారు. ఇప్పటికీ రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కనిగిరి, పెద్దారవీడు ప్రాంతాల్లో రైతులు రోడ్డెక్కి నిరసనలకు దిగారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరుబాటలో రాళ్లదాడి విషయంలో పొదిలి సీఐ తనకు నోటీసులు ఇచ్చారని, దానికి సాయంత్రం లోపు సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. బూచేపల్లి వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రమణా రెడ్డి, లీగల్‌సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, పీడీసీసీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

5458 మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు

ఒంగోలు టౌన్:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 5458 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాటీలు, నగర కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలతో పాటుగా పదోన్నతులు చేపట్టినట్లు తెలిపారు. గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు 83, స్కూల్ అసిస్టెంట్లు (బయోలాజికల్ సైన్సెస్) 26, స్కూల్ అసిస్టెంట్లు (సోషల్ స్టడీస్) 27, స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్) 11, పీఎస్ హెచ్ఎం 166, స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఇంగ్లిష్) నలుగురికి మొత్తం కలిపి 295 మందికి పదోన్నతులు కల్పించినట్లు వివరించారు. గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు 101, మోడల్ ప్రైమరీ స్కూలు హెచ్ఎం 545, స్కూల్ అసిస్టెంట్లు, తత్సమానం 1801, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, తత్సమాన కేటగిరి 2647, భాషా పండితులు 11, పీఈటీ 27, ఆర్, క్రాఫ్ట్, ఇతరాలు కలిపి 31 మందికి మొత్తం 5163 మందికి బదిలీలు చేసినట్లు తెలిపారు. బదిలీ, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మంగళవారం విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

కూటమి పాలనలో పెరిగిన అరాచకాలు

- పొగాకు రైతులకు ధైర్యం చెప్పడానికి వస్తే రైతులు, పార్టీ కార్యకర్తల మీద కేసులు
- విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలను నాశనం చేసిన కూటమి పాలకులు
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఒంగోలు టౌన్: కూటమి ఏడాది పాలనలో రోజురోజుకూ అరాచకాలు, అక్రమాలు పెరిగిపోయాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, విద్యా, వైద్య రంగాలతో పాటుగా వ్యవసాయం సంక్షోభంలో పడ్డాయని మాజీ మంత్రి, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున విమర్శించారు. కూటమి పాలన గురించి ప్రచురించిన వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎవరు ప్రశ్నించినా వారిపై ఎడాపెడా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో ఒక చిన్నారిపై 18 మంది అత్యంత క్రూరంగా అత్యాచారం చేస్తే పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టారని, ఒక గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారని, రాజమండ్రిలో దళిత మహిళను అవమానించారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యథేచ్ఛగా కేసులు పెడుతున్నారని, ఎస్సీ ఎస్టీ మైనారిటీల మీద దాడులతో పేట్రేగి పోతున్నారని చెప్పారు. సోషల్ మీడియా పేరుతో ప్రశ్నించే గళాలను కేసులతో వేధిస్తున్నారన్నారు. పొదిలి ర్యాలీ విషయంలో రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద కేసులు పెట్టడం కక్షసాధింపు చర్యలకు పరాకాష్టగా చెప్పవచ్చన్నారు. పొదిలి పర్యటన కోసం పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ముందుగానే పోలీసుల అనుమతి తీసుకున్నారని తెలిపారు. పోలీసుల అనుమతితో ర్యాలీ నిర్వహిస్తే టీడీపీ కార్యకర్తల చేత రాళ్లు వేయించి తిరిగి వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీదనే కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తోందన్నారు.

ప్రజలను మోసగించడం ఎల్లకాలం నడవదు: బత్తుల

మాయమాటలతో చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసగించడం ఎల్లకాలం నడవదని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి అన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర రావడంలేదని, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నవారికే పథకాలను అందజేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాల విషయంలో అన్నీ వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని ప్రజల్లో భయాందోళన సృష్టించడం ప్రజాస్వామ్యాన్ని హత మార్చడమేనని చెప్పారు. పొగాకు రైతులకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో పొదిలి పర్యటనకు జగన్ వచ్చారని చెప్పారు.

తప్పులను తప్పకుండా అనుభవిస్తారు: చుండూరి

రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు వేధింపులకు గురిచేస్తోందని పార్టీ ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరుబాట ర్యాలీలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో జైళ్లను నింపేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కనకరావు మాదిగ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు పమిడి వెంకటేశ్వర్లు, ఎస్.కృష్ణారెడ్డి, దుంపా చెంచిరెడ్డి, పిచ్చిరెడ్డి, శ్రీరామమూర్తి, కోటి రెడ్డి, తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21 నుంచి కుట్టుమిషన్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: కుట్టుమిషన్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ నుంచి 31 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల మహిళలు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8309915577 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై, సిబ్బంది

నాగులుప్పలపాడు: బెల్టు షాపుపై దాడి చేసి 8 మద్యం బాటిళ్లను నాగులుప్పలపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై రజియా సుల్తానా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో నాగులుప్పలపాడు పోలీసులు దాడి చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 8 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపైనా దాడి...

నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో పేకాటాడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు. వారి నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామికి ముగిసిన బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

సింగరాయకొండ:

స్థానిక పాతసింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి పుష్పయాగం కార్యక్రమంతో ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. పుష్పయాగం సందర్భంగా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

ఇరిగేషన్‌లో అవినీతి ప్రవాహం

- ఏసీబీకి పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ ఇంట్లోనూ సోదాలు
- అవసరమైన రికార్డులు తీసుకెళ్లిన ఏసీబీ అధికారులు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ శిరీష



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శిరీష



సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు

మార్కాపురం టౌన్:

నీటిపారుదల (ఇరిగేషన్) శాఖలో ఓ అవినీతి ఉద్యోగి బాగోతం వెలుగుచూడటంతో అతని కార్యాలయంతో పాటు నివాసంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అవసరమైన రికార్డులు తీసుకెళ్లారు. మార్కాపురంలోని ఇరిగేషన్ ఇంజినీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు సోమవారం రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీష ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఇరిగేషన్ శాఖలో 30 లక్షల రూపాయల విలువైన మూడు వర్కులను కాంట్రాక్టర్ ఏరువ శ్రీనివాసరెడ్డి పూర్తి చేశారు. అయితే, సదరు బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు రూ.30 వేల లంచం ఇవ్వాలని నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు రూ.30 వేల విలువైన 500 రూపాయల నోట్లను కాంట్రాక్టర్‌కు ఇచ్చి సోమవారం ఉదయం ఇరిగేషన్ కార్యాలయానికి పంపారు. ఆ నగదును శ్రీనివాసరావు తీసుకుంటున్న సమయంలో అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యాలయంలో శ్రీనివాసరావు పరిధిలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అలాగే మార్కాపురంలోని బొమ్మరిల్లు అపార్టుమెంటులో ఆయన ఉంటున్న ఫ్లాట్లో కూడా తనిఖీలు చేశారు. శ్రీనివాసరావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులను ప్రజలు సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ శిరీష సూచించారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శేషు, రమేష్‌బాబు, ఎస్సైలు మస్తాన్ షరీఫ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ దాడులతో అధికారుల్లో ఆందోళన...

ఏసీబీ అధికారులు మార్కాపురం వచ్చారన్న సమాచారంతో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు ఆందోళనకు గురయ్యారు. ఏఏ శాఖలపై దాడిచేస్తారోనన్న భయంతో మానసిక ఒత్తిడికి లోనయ్యారు. వివిధ కార్యాలయాల్లో ఎక్కువగా లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉండటంతో ఏసీబీ అధికారులు ఎప్పుడు దాడులు చేస్తారోనన్న ఆందోళన వారిలో మొదలైంది.

సీసీ రోడ్డు పగులకొట్టారు

- 'మీ కోసం'లో కలెక్టర్‌కు కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు ఫిర్యాదు



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అర్జీ ఇస్తున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శాంతారావు

ఒంగోలు సబర్బన్: కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో సిమెంట్(సీసీ) రోడ్డును అక్రమంగా పగులగొట్టారని కొత్తపట్నం మండల వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిసి వినతి పత్రం ఇచ్చారు. సీసీ రోడ్డు పగుల గొట్టిన తీరును వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాధనంతో నిర్మించిన సీసీ రోడ్డును అధికార టీడీపీకి చెందిన నాయకుడు బంకా శ్రీనివాసులు కావాలని పగులగొట్టాడని వివరించారు. సీసీ రోడ్డు పగులగొట్టటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిందని వివరించారు. సీసీ రోడ్డును పగులగొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, రోడ్డుకు జరిగిన నష్టాన్ని వారి నుంచే వసూలు చేసి రోడ్డును పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు శాంతారావు, అల్లూరు సర్పంచ్ సూర్య నారాయణ ఉన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, విజయజ్యోతి లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చేపల వేటకు ఆదిలోనే హంసపాదు

- ఆశాజనకంగా లేని చేపల వేట
- వాతావరణ ప్రభావంతో ఉధృతంగా సముద్రపు అలలు
- అలల ఉధృతితో ఆగిన చేపల వేట
- వేట సరిగా లేక ఆందోళనలో మత్స్యకార కుటుంబాలు



అలల ఉధృతితో ప్రకాశం జిల్లా పాకల తీరంలో నిలిచిన బోట్లు

సింగరాయకొండ: సముద్రంలో చేపల వేట నిషేధ కాలం ముగిసింది... వేట లాభదాయకంగా ఉంటుందని ఆశించిన మత్స్యకారులు ఆదిలోనే హంసపాదుతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట నిషేధ కాలంగా ప్రభుత్వం నిర్ణయించింది. వేట నిషేధ కాలం పూర్తవటంతో మత్స్యకారులు తీరంలో చేపల వేట ఆశాజనకంగా ఉండాలని పూజలు నిర్వహించారు. అయితే ప్రతి సంవత్సరం నిషేధకాలం పూర్తయిన తరువాత మొదటి రోజు చేపల వేట ఆశాజనకంగా ఉంటుందని ప్రతి ఒక్క బోటుకు 20 నుంచి 30 వేల వరకు చేపలు లభించేవని పాకల గ్రామంలోని మత్స్యకారులు తెలిపారు. కానీ ఈ సంవత్సరం మాత్రం కేవలం 6 నుంచి 10 వేల వరకు మాత్రమే చేపలు లభించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా చేపలు 100 నుంచి 150 కేజీలు లభించేవని, ఈసారి మాత్రం 15 నుంచి 20 కేజీలు లభించాయన్నారు. అయితే ఈసారి వంజరం రకం చేపలు లభించటంతో పాటు వాటి ధర కేజీ రూ.400 ఉండటం కొంత వరకు పరవాలేదని, అదే ఇతర రకాలైతే అవి కేజీ రూ.100 నుంచి రూ.200 మాత్రమే ఉండేవని తీవ్రంగా నష్టపోయేవారమని మత్స్యకారులు తెలిపారు.

వాతావరణ ప్రభావంతో అలల ఉధృతి:

వాతావరణ ప్రభావంతో సోమవారం అలల ఉధృతి బాగా ఉండటంతో ఒక్క పడవ కూడా వేటకు వెళ్లలేదని మత్స్యకారులు తెలిపారు. మొదటిరోజు వేట సరిగా లేదని, రెండో రోజు అసలు వేటే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పక్క పెరిగిన కరెంటు బిల్లులు, నిత్యావసర ధరలతో, స్కూలు ఫీజులతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

- పిల్లలు పరిశుభ్రంగా ఉండేలా తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: శిశువులు, పిల్లల్లో అతిసార వ్యాధిపై తల్లులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సూచించారు. ఒంగోలులోని కలెక్టరేట్‌లో మీ కోసం కాన్ఫరెన్స్ హాల్లో డయేరియాను నిలువరించాలనే కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకరోజులో మూడు, అంతకన్నా ఎక్కువసార్లు పలుచగా విరేచనాలైతే అతిసార వ్యాధిగా భావించి చికిత్స చేయించాలని సూచించారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం, పరిశుభ్రంగా ఉండటం ద్వారా అతిసార వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ ఓబులేసు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీస్‌శాఖ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సాధ్యమైనంత త్వరగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 65 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పోలీసు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. ఆయా ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ.. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు స్వీకరించినప్పటి నుంచి పూర్తయ్యేంత వరకు ఎస్పీ కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. బాధితులకు చేసిన న్యాయానికి సంబంధించిన నివేదికలను ఎస్పీ కార్యాలయానికి పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ రమణ కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఆధారాల సేకరణ

- ఆస్పత్రిలో కోలుకుంటున్న బాధితురాలు పద్మజ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు పద్మజ



గోలి పద్మజ (ఫైల్)

చీమకుర్తి: సాధువు వేషంలో వచ్చిన నిందితుడు ఓ మహిళపై దాడి చేసి బంగారం దోపిడీ చేసిన కేసులో చీమకుర్తి పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. నేరస్తుడిని రెండుమూడు రోజుల్లో పట్టుకుంటామని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. చీమకుర్తిలోని ప్రభుత్వాస్పత్రి పక్కన నివాసం ఉంటున్న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గోలి పద్మజపై ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి సాధువు వేషంలో వచ్చి కత్తి, రుబ్బురోలు పత్రంతో దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసుతో పరారైన సంగతి తెలిసిందే. వెంటనే అప్రమత్తమైన పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. పరిసరాలలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నిందితుడిని ఈపాటికే పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. పూర్తి ఆధారాలు సేకరించి రెండుమూడు రోజుల్లో నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు పద్మజ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆమె కోలుకుంటుందని బంధువులు తెలిపారు.

ఉపాధిలో 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటల సాగు

ఒంగోలు టౌన్: 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం రాయితీతో పండ్ల తోటలు, పూల మొక్కలు సాగు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డ్వామా పీడీ జోసఫ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌కార్డు కలిగి ఉండి 0.25 నుంచి 5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. పంటను బట్టి 3 సంవత్సరాల పాటు వాచ్, వార్డ్, వాటరింగ్, ఎరువులు, నిర్వహణ ఖర్చులను పూర్తిగా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 6500 ఎకరాల పండ్ల తోటలు, పూల మొక్కల పెంపకం చేపట్టాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 1417 మంది రైతులను, 3482 మంది ఎకరాల్లో గుర్తించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు మండల అభివృద్ధి అధికారి, ఎంజీఆర్ఈజీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఉపాధి హామీ ఏపీడీని సంప్రదించాలని కోరారు.

ఆగిసాగిన పొగాకు వేలం

- కనిగిరిలో కొంతసేపు బహిష్కరించిన రైతులు
- అన్యాయం జరుగుతోందంటూ ఆవేదన
- వేలం కేంద్రం సూపరింటెండెంట్ సర్దిచెప్పడంతో తిరిగి కొనసాగిన వేలం



వేలం కేంద్రంలో అధికారులు, బయ్యర్లను ప్రశ్నిస్తున్న రైతులు

కనిగిరిరూరల్: పొగాకు రైతుల గోడును కూటమి సర్కార్ పట్టించుకోవడం లేదు. దీంతో పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. మద్దతు ధరలు కల్పించాలని, వేలం కేంద్రానికి తెచ్చిన అన్ని రకాల పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలని, లో గ్రేడ్ బేళ్లను తిరస్కరించకుండా తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కనిగిరిలో పొగాకు వేలాన్ని రైతులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. మాచవరం క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు 618 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. బయ్యర్లు మంచి రకం (ఎఫ్-1, ఎఫ్-2, ఎఫ్-3) బేళ్లను మాత్రమే కొనుగోలు చేస్తూ నామమాత్రంగా ఒకటీరెండు లో గ్రేడ్ బేళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు. దీంతో వేలం కేంద్రం సూపరింటెండెంట్ కోటేశ్వరరావు రైతులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నం చేశారు. 9 కంపెనీలు వేలంలో పాల్గొంటున్నప్పటికీ అందరూ ఎందుకు కొనుగోలు చేయడం లేదంటూ సూపరింటెండెంట్‌ను రైతులు ప్రశ్నించారు. మంచి గ్రేడ్ బేళ్లు కొని మిగిలిన వాటిని తిరస్కరిస్తే తమ పరిస్థితి ఏంటని నిలదీశారు. కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని, కంపెనీలన్నీ కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లో గ్రేడ్ బేళ్లు కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో రైతులు తిరిగి వేలంలో పాల్గొన్నారు. మాచవరం క్లస్టర్ పరిధిలోని గ్రామాల నుంచి 618 బేళ్లు వేలానికి రాగా, వాటిలో 378 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 240 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.280 పలకగా, కనిష్ట ధర రూ.180 పలికింది. సరాసరి ధర కేజీ రూ.249 పలికినట్లు అధికారులు తెలిపారు.

టంగుటూరులో చెయిన్ స్నాచింగ్

టంగుటూరు: వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో బంగారు చెయిన్‌ను గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని వెళ్లిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టంగుటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టంగుటూరు గ్రామానికి చెందిన చెరుకూరి ప్రభావతి టంగుటూరు - అనంతవరం రోడ్డులో ఆదివారం సాయంత్రం వాకింగ్ చేస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి నడుచుకుంటూ వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు చెయిన్ లాక్కుని పంట పొలాల్లోకి ఉడాయించాడు. దీంతో లబోదిబోమంటూ టంగుటూరు పోలీసుస్టేషన్లో బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

పెళ్లి పేరుతో మోసం

- బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు

ముండ్లమూరు (కురిచేడు):

పెళ్లి పేరుతో ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిపై ముండ్లమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ముండ్లమూరు ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముండ్లమూరు మండలంలోని బట్లపల్లి గ్రామానికి చెందిన మహిళకు చీమకుర్తిలోని గాంధీనగర్‌కు చెందిన వ్యక్తితో 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంతకాలం తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో చట్టప్రకారం విడిపోయారు. దీంతో ఆ మహిళ బట్లపల్లి గ్రామంలోని పుట్టింటికి చేరింది. తన పెద్దమామ కుమారుడు యద్దనపూడి సుధాకర్ ఆమెను పెళ్లి చేసుకుంటానని వెంటపడ్డాడు. పెద్దల అంగీకారంతో వివాహం చేసుకునేందుకు ఆ మహిళ అంగీకరించింది. కానీ, ఇరువైపుల పెద్దలు అంగీకరించకపోవటంతో వివాహం నిలిచిపోయింది. కానీ, సుధాకర్ మాత్రం ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి నమ్మించాడు. ఎలాగైనా పెద్దల అంగీకారంతో వివాహం చేసుకుందామని చెప్పాడు. ఇక్కడి పెద్దలు అంగీకరించడం లేదని, హైదరాబాద్ వెళ్లి వివాహం చేసుకుందామని చెప్పడంతో అతనితో కలిసి ఆ మహిళ హైదరాబాదు వెళ్లింది. అక్కడ ఓ గది అద్దెకు తీసుకుని మంగళసూత్రం, మెట్టెలు తెచ్చి చూపించి గుడికి వెళ్లి పెళ్లిచేసుకుందామని చెప్పాడు. కానీ, మంచి రోజు కాదని, మంచి రోజు చూసి చేసుకుందామని చెప్పి తిరిగి రూంకు తీసుకొచ్చాడు. రూంలో మోజు తీర్చుకున్నాడు. ఊరు వెళ్లి పెళ్లి చేసుకుందామంటూ తిరిగి ఒంగోలు తీసుకొచ్చాడు. తన బంధువుల ఇంట్లో ఉంచి తల్లిదండ్రులు, బంధువులకు జరిగిన విషయం చెప్పాడు. వారంతా కలిసి గత ఏప్రిల్ 30న వివాహం చేయాలని నిర్ణయించి ఆ మహిళను ఆమె పుట్టింటికి పంపారు. ఆ తర్వాత ఏమైందోఏమోగానీ వివాహం చేసుకునేది లేదని, నీకు దిక్కున్నచోట చెప్పుకోమని, మళ్లీ ఫోన్ చేస్తే చంపేస్తానంటూ సుధాకర్ బెదిరించాడు. ఆ మేరకు బాధిత మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. సుధాకర్‌ను అతని తల్లిదండ్రులు, అన్న, మేనమామ దాచిపెట్టారని, సుధాకర్‌తో పాటు వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.